యూనిట్ III

# 8. సీతక్క పెండ్లి

– డా॥ పి. యశోదారెడ్డి

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

రంగయ్య కూతురు పెళ్ళీడుకొచ్చింది. సంబంధాల కోసం వెతుకుతున్నాడు. ఎక్కడికి వెళ్ళినా 'వరకట్నం' కావాలని అడుగుతున్నారు. చట్టం ప్రకారం నేరమైనా ఆయనకు ఇది తప్పటంలేదు. వరకట్నమిచ్చి అల్లుణ్ణి కొనుక్కొనే స్తోమత రంగయ్యకు లేదు. రంగయ్య కూతురు చదువుకున్న అమ్మాయి కూడా.

### ప్రశ్నలు

1. ఈ సంఘటన దేని గురించి చెబుతుంది?
2. కూతురి వివాహంలో రంగయ్యకు ఏర్పడిన సమస్య ఏమిటి?
3. ఈ సమస్య కేవలం రంగయ్యకు మాత్రమే ఉందా?
4. ఈ సమస్యను అధిగమించడానికి ఎలాంటి పరిష్కారం కావాలి?

© SCERT not to be republished

### ఉద్దేశం

ధనం కన్నా గుణం ముఖ్యమని చెప్పడం, మానవీయసంబంధాల ఔన్నత్యాన్ని తెలియజేయడం, వివాహ సంప్రదాయలను వివరించడం ఈ పాఠం ఉద్దేశం.

**ప్రస్తుత పాఠ్యభాగం** డా॥ భార్గవీ రావుగారు 2000 సంవత్సరంలో సంకలనంచేసిన 'నూరేళ్ళపంట' అనే గ్రంథంలోనిది 'సీతక్క పెండ్లి'ని రాసిన వారు పి. యశోదారెడ్డిగారు.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

**తూ**ర్పున సింగిణేసింది. ఉత్తరాన ఉరిమింది. కోటమెరిసింది. ఇంగిలీకపు పూత బూసినట్లు మొగులుకు అడ్డంగ ఈ ఇంద్రధనుస్సు తీరుతీరు వర్ణాలతోటి కానొస్తుండది. ఓ దిక్కు ముసి ముసి సీకట్లు ముసురుకోంగ మొగులంతా ముత్యాల పందిరి జలతారు చీరకొంగోలె తళుక్కు తళుక్కు మంటుండది. వూదా, ఎరుపు, డాంకురేకులు గలిసి జిగజిగలు గురిసినట్లు మెర్పులు చిత్ర–ఇచిత్రంగ, తళ్కులు ఈన్తుండయి. పడమటి దిక్కున మూస బోసిన బంగారం ముద్దోలె–సూర్యుడు ఎఱ్ఱగ గాన్రావట్టిండు. తొడుక్కున్న పరికిణీల మీద సింగారిచ్చుకున్న వొల్లెలు సన్నటి కందిరీగె నడ్మలకుజుట్టి గలగల నగుకుంట ఆడపిల్లలంతా పుంగిళ్లుపూయ వాకిట్ల గుమిగూడుతుంటే అడవి మొల్లలన్ని మొగ్గలిచ్చుకోని ఇరబూసి జతలు గట్టి వొచ్చి నిలవడ్డట్లు అనిపిస్తుండది. ల్యాగదూడలన్ని చెవులల్ల ఎందో కొత్తగాలి జొరినట్లు మెడల గంటలు గణగణమోగంగ చెంగు చెంగున దుంకుతుండవి. మనిషికైనా పసురానికైనా పసితనమే ముద్దూ మురిపెం.

సుక్క వొడువంగ సీతలేసింది. కడుపలు పూజిచ్చింది. మంగళార్తి దెచ్చింది. మాణిక్యాలల్ల వత్తులేసి నూనెవోసింది. చిగురు పసరు చీరగట్టింది. బీరపువ్వ అంచు రయికె దొడిగింది. నడుముకు గంటల మొలకట్టు, కాళ్ళకు గజ్జెల అందెలు పెట్టింది. అవి నేనంటె నేనని అడ్గు అడ్గుకు మాటల మాటగలిపి మాట్లాడినట్లు గలగల మంటుండవి. ఇంతట్లోకే పాలేరు రంగయ్య నాగలి ఎత్తుకొచ్చిండు. నాగల్ని పస్పుకుంకుమల్తోటి పూజిచ్చిన్రు, మల్లన్న రామన్నల కొమ్ములకు జాజులుపూసిన్రు, పూలుజుట్టిన్రు, నుదుర్న నామాలుదీర్సింన్రు. పెద్ద పాలేరు నెత్తికి రుమాలు జుట్టిండు. గుగ్గిల్లపుపొగ ఏసిండు,కొబ్బెరికాయ గొట్టిండు. దెబ్బకు అది ముక్కముక్కలైంది. “నాయినా! బూలక్ష్మి ఈసారి మనంబిలుస్తేపల్కుతదే!” అని అంటు ఉంటే ముత్యాలజల్లు గుర్సినట్లు నగులువొల్కవట్టినయి. ఇంతట్లకే ఊరి పెద్దరైతు నాగలి నడ్సింది. ఈ త్యాప ఆ నాగలిపట్టింది పెద్దపాలేరుగాదు, పెద్దకొడ్కు రఘురాములు. తుమ్మపువ్వంచు దోతి గట్టి బొందెల అంగిదొడ్గి , చేత్లచెర్లకోలపట్టి మొగతనమంతా కరిగిచ్చి పోసినట్లున్నడు. ఆ పిలగాడ్కి మాసీత కండ్లల్ల వడ్డది. కండ్లపడంగనే మంతరిచ్చినట్లు, మైదు జల్లినట్లు, కనికట్టు గట్టినట్లు, కలగన్నట్లు, కన్నది మర్సినట్లు, చిత్తార్ని దించిన బొమ్మ తీర్గ నిలపడ్డడు. నిలపడడామరి? అందుట్ల చిత్రంయాండది?



నా బిడ్డ అనిగాదు, గని, కౌచిప్పలోలె కండ్లు, జమిడిరెప్పలు, పాల్గారెచెంపలు, తేనె మెత్తగ జుట్టి ఆ తీపికి మత్తెక్కి లేవలేక కుప్పలుగట్టి అణ్ణెకూలవద్ద గండుతుమ్మెదలోలె నల్లటి ముంగుర్లు. దాని ముక్కే కొంచెం... ఏంది? కొంచెం ఏక్తారు తీగోలె. బడిపిల్లల పెన్సిల్ ముల్కితీర్గ సన్నగ కొస్సెగ ఉండాల్నా ఏంది? నిజంగ చెప్పాలంటె ఆ ముక్కు తీర్పే గాని మొకానికి ఎలుగిస్తుండది.

కన్నమ్మ కష్టంమీద రఘురాంల తండ్రి మా సీత పెండ్లికి ఊఁ అన్నడేమొ. అంతట్లకె పారిజాతపు చెట్టొచ్చి గడ్డిపోసను పలుకరిచ్చినట్లు, గంగానది జలాలొచ్చి పిల్వకాల్వను కౌగలిచ్చుకొన్నట్లు, మేరు పర్వతం పలుగురాయితోటి ఇయ్యం అందినట్లు, నింగి వొదిగివొచ్చి న్యాలను ముద్దిచ్చుకున్నట్లు ఈ సంబంధం ఏందో నన్ను పొడుగుజేసినట్లు, నానెత్తిన పచ్చల తురాయి పెట్టినట్లు, లేనిది కన్నట్లు, అపురూపమైనట్లు అందరు అనుకోవట్టిన్రు. ఓ రూపుకంగ జూస్తే అవుననొచ్చు. అల్లుడుమట్కు **అష్రఫీ**, మేలిమి బంగారపు సలాక, గుణాల పాతర, నా తల్లి సీత నోసుకున్న గౌరమ్మ నోముఫలం అని నేనెంత ఉల్లాసంగ ఉన్నా నా కెందుకో మనస్సు చివుక్కుమని సిన్నవోయింది. ఈ తరాన కులాలు తలాలు లేవంట? యాడలేవు? ఎక్కడలేవు? ఇంగా గడ్డపారన వొడ్సి దిమ్మస జేసినట్లు గట్టిగ పాక్కపోయినయి. ఇంతకు కోటయ్య నాకులపోడేగదా? అయితే ఈ కుంపటేంది? ఆయినకు మాట ఉండది. నాకు మాట ఉండది సరే! ఆడపిల్ల తండ్రిని ఎందుకైనా అడిగిమడిగి ఉండెటోళ్లమే. కోరినంత పెట్టినను కోతి శివుడంట. కోరికోరి కొనుక్కున్న సంబురమే గదా? హిమవంతుడు అసొంటోడు బిడ్డకోసం జోగి, సన్నాసి, బిచ్చగాడు, బైరాగి, ఇబూతిపూతగాణి కాళ్లుగడ్గికట్నం బెట్టలేదా? ఇగ మనం అనంగ ఎంత? తప్పదు. కోటయ్యతోటి ఇయ్యం అంటే మామూలు మాటలా? పగటి దివిటీలు ఎలిగిచ్చాలె. నా గాదెలు గుమ్ములన్ని జలగడ్గినా పిలగాణి తరపోండ్లకు ఒక్కపూట కుడ్పుకుగావు. రుణం బుట్టకపోతదా. చేబదులు ఇస్తేసరే! లేకపోతే మిత్తికి దేవాల్సివొస్తది, అమ్మో మిత్తి? అవును మిత్తి–అయితే మిత్తి! మిత్తే!

"శ్రీరంగరాయుడా? నాకు కొంత రొక్కం గావల్సి వొచ్చిందయా!" "సూడునాగయ్యా! నీపనీ, నాపనీ మరోటిగాదు. ఈ కల్యాణం సాక్షాత్తు ఆ పద్మావతీ శ్రీనివాసులదే అనుకుంటుండ గని, ఈ నడుమ కూసిన కుక్కకూ, లేసిన జింకకూ యావో పెద్దపెద్ద ఆలోచన్లు. అందర్కి బొందితోన సొర్గం జూతామనే తాపత్రయం. అందుకని పైస ఆసరగావాలె. ఆ ఆసరతోటే కంట్రాక్టులు, ట్రాక్టర్లు, ఎరువులు, ఇంజన్లు, విలాయితులు, ఇచిత్రాలు. ఇవి అన్ని సాపుగ జరుగాల్నంటె లక్ష్మిందేవి సల్లగ జూడాలెగదా! అన్నా ఎట్ల జెప్పిన ఇంటవుగని నిజం జెప్తుండ. నా గల్ల పెట్టెల రొక్కం పదింతలై నిండుకొస్తున్నా చేతుల మీది సొమ్ము చేతుల మీదనే ఎగవడి అందుకుంటుండరు. మరి నెలకు నూటికిమూడు, అదైనా మూణ్ణెల్లు ఆగాలె."

"రామచంద్రా! నూటికి మూడు! నావశం గాదు. వస్త అన్నా! మరి"

ఈ సంబురమంతా నా సీతక్క పాపెట తీర్పుకు, నాబిడ్డ కండ్ల కాట్కె సక్కనకు, నా తల్లి బొట్టు పొందికకు, బాసికపుకూర్పుకు, నాపందు ఒడిబియ్యానికి, నామొల్క ఎదుగుకు, నాకంటి సలువకు, ఆ సీతారాముల జంటకు ఆ జత ముద్దు మురిపానికి.



మ్యానత్త లొచ్చిన్రు, ఇంటి పెద్దమనుసు లొచ్చిన్రు, సుట్టాలొచ్చిన్రు, జాతకాలొచ్చినయి, పంచాంగాలు వట్టిన్రు, శ్రీమా అన్నరు. పస్పులు జిట్లినయి, ఐదుమంది ముత్తైదలు అప్పడం వొడెంబెట్టిన్రు, పాకంగుదిరి అరిసెలు సాగినయి. మ్యాదర గంపలొచ్చినయి, జీడిగుల్లలొచ్చినయి, పెద్ద పేర్పులొచ్చినయి. సక్కెరసంచులు, బెల్లపుముద్దలు, గాదెలగూసున్నయి. జంఖానాలు, ఇస్తార్ల కట్టలు, గాజు గిలాసలు గంపల్ల అట్కఎక్కినయి. కుడుకలు, బాదంకాయలు, నగుపత్తులు, యాలక్కాయలు, గుండుపోకలు, కజ్జెరపండ్లు, తలువాల బియ్యాలు, వొడినాలు, రయికె మడ్తలు, పెట్టువళ్ళ సీరలు, అత్తర్లు పన్నీర్లు నాల్గు కొట్టైళ్ళు నిండినయి. నేతిపావు దగ్గరనుండి ఇర్స ఉడ్కె అండదాక పాతరసామానంత యాదీలేదనకుండ లెక్కజూసి పొందిచ్చిన్రు. కాకెరొడ్లు పొతమైనయి. నేతి పేసలు పదిలమైనయి, లడ్డూ, జిలేబీలు సాగాలె. వొద్దుసుమా! మోటు. నాజూకు పేర్లుండాలె. అయితేజాంగిరి, బాదుషాలు గానీయండీ. ఆ ఇదంత కట్టె పలారం కిందనే జమ. పెండ్లికొడ్కు సుట్టాలకు అప్పటికప్పుడు ఉడ్కుఉడ్కు ఉండే ఉప్మా, పూరీ, కోడిమాంసం ఉండాలె.

“ఎన్కటి మన మోత్కాకు పందిళ్లుగావంట. కొబ్బెర ఆకుల్తోటి కల్యాణ మంటపం కట్టాల్నంట. పోకగెలలు యాళ్ళాడేయాల్నంట. పట్నంలకెళ్ళి బషీర్‌మియ్యను పిల్సుకొచ్చి డాంకురేకులతోటి చాందుతారాలు వెట్టిచ్చి కనుకాంబరాలు, మల్లెలు గూర్సి పూలసింగారం జేయాల్నంట. డేరాలేయాల్నంట. చాందినీలు గట్టాల్నంట బిజిలి, పంకాలు గావాల్నంట. మాడికాయ షర్బతు వొద్దంట. కొత్తకుండల నీళ్ళు కొత్తవాసన గడ్తవంట. మినిష్టర్లు వొస్తరంట. సల్వరేకులు పర్సి తెల్ల చెద్దర్లు ఏయాల్నంట. ఆనుక, కూసుండేటందుకు గద్దెమెత్తలు, గుండు మెత్తలు ఏయాల్నంట. సలువకొరకు రొండు దినాలకు ముందే బరఫ్ ముద్దలు దెచ్చి, అది కర్గిపోకుండ ఉప్పుబస్తాలు గుమ్మరిచ్చి కప్పాల్నంట. అయ్యోదేవుడో ఈ కాకకు ఇగం

గర్గుతదో కర్గదోగని నేను మాత్రం ఇంతింత ఇసుమంతై వనగండ్లు గర్గినట్లు గర్గి కాల్వల పార్కం మాత్రం ఖాయం. సరే ! కానీ!”

రుణందెచ్చిన సగం ఏన్గెదిన్న ఎలక్కాయతీర్గ యాడ్కి ఎట్లా మాయం అయిందోగని ఐంది. ఆయాళ్ళనిచ్చితార్థం. పెట్టెలున్న పట్టు సీరలన్ని మావోళ్ళు ఈయాళ్ళనే సింగారిస్తుండరు. మరి రేపు పెండ్లికి యాదాపుడుసీరలు గడ్తరో? పసురానికి తిన్నది బలం మనిషికి ఉన్నది బలం; మావోళ్ళు యాడ దాపెట్టుకున్నరో,వొంకర టింకర వయిసే సక్కన సూడు! ఈడొచ్చిన పిల్లలంతా కాళ్ళకు పస్పులు పూసుకోని ఈ ఆ పనులు అందుకుంట ఉంటే కుసుమసేను పండినట్లు, బీరపందిళ్లు పూసినట్లు కానొస్తుండరు. నాతల్లి పీటల మీదగూసున్నది. వాళ్ళ పెద్దాడిబిడ్డ జోడుచిల్కల చీరవెట్టి పచ్చల ఉంగురం ఏలికి దొడిగింది. మల్లెపూల జడేసుకోని, నింబోళి చీరగట్టుకోని కొంచెం నెత్తివంచి కూసున్న నా బిడ్డను జూడ రెండుకండ్లు జాల్తలేవు. నిండుగ చిగురేసి మొగ్గపెట్టిన మల్లెతీగోలె, పూతకొచ్చిన కడ్మి చెట్టోలె గానొచ్చింది .సాలీ సాలక బత్కిన నా గుణం బోనియ్యక ఇంత దనుక ఏందో కర్సు కర్సు అనుకుంట కొంచెపు ఆలోచన్లు జేస్తిని. నా చిల్క సింగారానికి నా బూములు కుదువ ఓ లెక్కనా? నేనమ్ముడువోయి గాన్గకు ఎద్దయితిర్గినా పర్వలేదు అని అనుకున్న . తెల్లార్తే అంతా పండుగనే. తెల్లారింది. రీతిపోంటి మేము వర నిచ్చయానికి బోయినం. భవంతి నడ్మ గద్దె పీటలమీద కోదండం మర్సిన ఆ రఘురాముల తీర్గనే ఈ రఘురాములు గానొచ్చిండు. అయితే ఆ రఘురాములు అల్లనేరేడు పండోలె నలుపు. నా అల్లుడుమట్కు, పసినిమ్మపండోలె పస్పు. **కర్కోటకుడు** కోటయ్యకు ఈ మాణిక్యం ఎట్ల ఉట్టిండో?పూర్వపుణ్యం. పెట్టిపుట్టిన జన్మల తీరు అది అని అని సంబురపడ్డ. ఎందుకో గని నా ఎద అదుర్తనే ఉండది. చేతులువొణుకంగ ఆచారం కొద్ది బొమ్మంచు దోతులు, బంగారు బటువువెట్టి అక్షంతలు ఏసిన. పిల్లగాడు ఎంటనే లేసి నా కాళ్ళకు దండం బెట్టిండు. అప్పుడది సంబ్రమో? బుగులో? బిడియమో తెల్వదు. నాప్పై ముల్లేసి ముచ్చెమట్లు వోసింది, దస్తురుమాల తోటి దుడ్సుకున్న. బోజినాలైనయి. తాంబూలం ఇచ్చిన్రు. ఇంతట్లనే ఇయ్యంకుడు నన్నొక్కణ్ణి దివాన్‌కాండ్లకు పిల్సి.

“బావా? అన్ని సరేగాని కట్నం మాట?” అన్నడు.

ఆ మాట ఇట్లసెవిన వడ్డదో లేదోగని నేన్యాడికో పాతాళానికి గూలిపోయిన గని సత్వ జిక్కవట్టుకోని“తమరు తొల్త ఈమాట పేరుకైనా ఎత్తలేదు మరి?” అనంగనే

“అన్నన్నా ఏం తెలివిమంతుడవయ్యో! అమాయికమా? నాట్కమా! ఎంత అమాయికం ఉన్నగని దినాం అగ్బార్లు సదువుతలేవా? పెండ్లిల్ల కట్నం రూపుకంగ ఇచ్చిపుచ్చుకాలు తప్పు అని. అయితే నలుగుట్ల బయిరంగంగ ఇంత అని కట్నం పేర్నబిల్సి నా బత్కిన బత్కుకు ఓ మచ్చ గూర్వమన్నవా? ఎట్ల? ఏదో బజార్నపడి గుట్టు బయలుగాకుండ మరోపుర్గు గర్తుపట్టకుండ జర్గిపోవాలె అని అనుకున్న గని నీవాల్కం జూస్తే నా గంభీరం నిలవెట్టేటట్లు లేవు. ఆ తెచ్చిన దోతి సింగారం జూడు, బటువుసోకుజూడు బంగారం దెచ్చిండు, రవ్వకరువైనట్లు. ఇంతకూ మేం నీ నజరుకు ఆనినట్లులేం.”

“అయ్యా”

“ఆc లేకుంటె ఏందయ్యా! సరే! జరిగింది ఏదో జరిగిపోయింది. నడ్సిన జాగను తిర్గిసూస్కం నా గుణంగాదుగని ముందుమాట మాత్రం ఖరాకండి. ఒక్కటకి తగ్గదు.”

"అయ్యా! జిలుకర బెల్లాలైన మర్నాడే ఆ వెయ్యి పూలల్ల వెట్టి"

"ఆ ఏమన్నవూ? వెయ్యా? నాకొడుక్కా? మా రాముడు బజ్జిగొడ్డనుకున్నవా? పోతుదున్ననుకున్నవా? ఈనాడు ఓ సన్నకారు కోడెదూడనే రొండువేలు చేస్తుంటే నాకొడ్కు నీకు ఇంత అగ్వ గండ్లవడ్తుండదా? అమ్మా! నీకెంతదీమా? నా తోన సవందం ఖాయం జేయాల్నంటే ఒక్క లకారానికి పొల్లుపోగూడదు. ఇంగో షర్తు! ఇచ్చి పుచ్చుకాలు మావోణి చెవిసోకగూడదు. అయినా నేనేం నీమెడ మీద కత్తివెట్టి అప్పుడే రొక్కంస్తాంబాళం గుమ్మరియ్య మంటలేను. నిదానంగనే ఇత్తువు గనీ, నీ పది ఎకురాల మాగాణి పొలం మాత్రం నా పేర కాయిదం రాసియ్యి. లేకుంటె తెచ్చిన వరకట్నం నీఇంటికిమళ్లుతది అనే అనుకో, దీని మీద నీ ఇష్టం."

అవును నా ఇష్టమే! నాకున్న పొలాన్ని ఇంతకు ముందే పెండ్లి కర్సుల కని కుదువ తగిలేస్తిని. ఇంగ నా ఇష్టానికి మిగిలింది నేనూ నా పెండ్లాం. మనిసి మారాలే మనుసుండాలె, ఇసం ఉన్నకాడ దాని ఇర్గుడు పుట్టనే పుట్టింది. ఇంతకూ యాది సక్కన ఉండది గన్క నాగయ్యది వొంకర అందును? తిట్టాల్సివొస్తె నా శాతగాని తనాన్ని దిట్టాలె. అనాల్సివొస్తె ముక్కు సూటిగ వోయే నా గుణాన్ని అనాలె. అంతేగని మందిని నిందెవెట్టి ఏం లాభం? లాభం ఉన్నా లేకున్నా దేన్నిదిట్టినా, దేన్ని మెచ్చినా, అనుకున్నా పెండ్లి గాలేదు. రఘురాంలు విలాయతుకు వోయిండు. మాటన్నా పలుకలేదు.

మా సీత కత అంత ఇన్నది. కన్నీటి సుక్కన్నారాల్వలేదు గని సరసర గిర్కతీర్గఇల్లంత దిర్గేసీత మెల్లగ నడుస్తుండది. ఏందో పోగొట్టుకున్నట్లు కండ్లవడ్తది. నగినా ఆ కండ్లల్ల మెరుపులేదు. పొగురు స్యాపలసోంటి కండ్లు మెరుగు ఆరి గాజుగుడ్లోలె ఐనయి. దాన్ని దల్సుకున్నప్పుడల్లా నా మనుస్సు కుమ్మరి ఆవం గాలినట్లు, కుమ్ములవెట్టిన మాడికాయ ఉడ్కినట్లు ఉడ్కుతది. ఈ సంకుటం పగోడ్కి గూడ వెట్టకు తండ్రీ! ఇంత కత నిన్న మొన్న జరిగినట్లే ఉండది. కాలచక్రం ఓ సుట్టుదిరిగింది. వరుదలువొచ్చి మిట్టపల్లాలు గా(న్రాకుండవోయినట్లు ఈ యాడాది పొద్దు నా బిడ్డ గాయన్ని మాన్పుతే బాగుండు. మరో సవందం దొర్కదనిగాదు. గని ఆ ముచ్చట దీయాల్నంటేనే ఇచ్చినమాట దప్పినట్లు నమ్మినక్షణం గొంతు గోసినట్లు, దాసుకున్న సొమ్ము దోసుకున్నట్లు, కాని పని జేసినట్లు బుగులైతది. దాని మనుసు ఎట్లుండదో? అది నిండుకుండ. తొల్కదు. ఆ నాడు శ్రీరంగనాయికులను మెచ్చిన గోదమ్మ తీర్గ మా సీత నడ్తంత అదోతీరున ఉండది. అందుకే ఈ కొత్తకారు మత్తెక్కిన ఉర్ములు, మెర్పులు, పెక్కుగట్టిన పాతపుండును పచ్చి నెత్తుర్లు వొల్కజేసి ప్రాణసంకుటం దెస్తవేమో నని భయం.

సీత ఆవు పాలు పిండీ పిండనట్లు జేసి ల్యాగదూడల పల్పులు ఇడ్సి ఆవుల కాడ్కి దోల్తుండది. ఆ నెమిలి పిట్ట పురి ఇంకా గుండుగ ఇసునకర్రోలె ఇప్పుకొని కేరింతలు గొట్టుకుంట నాట్యం దొక్కుతనే ఉండది. సీత ఆ కడ్మిసెట్టు కాడ్కి, వోకుండ ఉంటదా? పూలన్ని దండ గుచ్చుకున్నది. నా తల్లిది ఏంసొగసు? అబ్బ కండ్లన్ని మిరుమిట్లు వడజేసుకుంట ఈ మెరుపు జుల్కు జూడు. "ఆ ఎవరు అది? ఈ మబ్బులల్ల, గాళ్ళల్లపడి మా ఇంటి దిక్కు నడుస్తుండరు? పోవడిజూస్తే మా రఘురాంలతీరు, మా ఏంది మా ? ఆ కోటయ్య కొడ్కోలె ఉండడు. పోవడిగాదబ్బో! ఆయినే ! ఇంకేం ఉండది? ఆ రాగడే, ఎంకటేశ్వర్లు! గౌరమ్మా ! ఓ అలివేలుమంగా! ఆంజనేయులూ ఈ గండం గడ్పుండి. ఈ పిడ్గునుజూస్తే నా బిడ్డ గూలి బూమిమట్టం గాదా! నా బిడ్డను నాకు దక్కించ్చుండి. అయ్యో అనుకున్నంత పనైంది. నా సీత నడిసివొచ్చిన ఈ ముప్పును కండ్లారజూసింది. ఈదరగాలికితీగెలు అల్లాడినట్లే నా బిడ్డ కదలిపోతుండది. తల్లిని విలిస్తే బాగుండు అని రొండడ్గులు నడ్సిన.

అంతట్లకే మెరుపు ఎంటనే ఇంగో మెరుపు వొచ్చినట్లు వొచ్చి ఇల్లు జొచ్చిండు. ఇంట్లకెట్ల ఆ పిలగాడు వొచ్చిండో? చెట్టు కింద నిలవడ్డ సీత రాముల సేతులకెట్ల వోయిందో నాకేదెల్వలేదు. కన్నుమూసి తెరిసేట్యాళ్ళకు ఇంత ఇంద్రజాలం జరిగింది.

నేను ఆడ ఉన్ననన్నధ్యాస గూడ మర్సి రఘురాములు సీతసేయిని తన చేతుల కల్పి పట్టుకొని గొరగొర గుంజుకుంటొచ్చి, ఆడ ఓ గుంజ తీర్గ నిలవడ్డ నాకాళ్ళమీద వాలిన్రు. నాకేం జేయాల్నో తోచలేదు. నాకాళ్ళమీద పణలు మోపిన ఇద్దర్ని ల్యావట్టి రొండు చేతుల్తోటి ఎదకు అలుముకున్న. ఇంతట్లకె వాకిట్ల ఏంకత జర్గుతుండదో దెల్వక సీతతల్లి మాలక్ష్మివొచ్చి గుడ్లప్పగిచ్చి నిలవడి యాదిదెల్వక ముగ్గుర్ని ఓముడిల జూసి దేవుణిదిక్కుదిర్గి రొండుచేతులు జోడిచ్చికండ్ల నీళ్లొత్తుకున్నది. ఇంతైనంక సీత మేల్కొన్నట్లు మమ్ములను ఇడ్సీ సంటిపిల్లోలె తల్లి సంకల జేరింది. ఆనాడు రాత్రి మా ఇంట్ల కోటి ప్రెమిదలు ఎల్గినవి.

## రచయిత్రి పరిచయం



డాక్టర్॥ పాకాల యశోదారెడ్డిగారు 1929లో మహబూబ్‌నగర్ జిల్లాలోని బిజినేపల్లి గ్రామంలో జన్మించారు. తెలుగులో కరినాంశాలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్‌పొందిన వీరు తెలుగు ప్రొఫెసర్‌గా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేశారు. అధికార భాషా సంఘానికి అధ్యక్షురాలిగా పని చేసిన తొలి మహిళ. వీరి ధారావాహిక రేడియో కార్యక్రమం "మహాలక్ష్మి ముచ్చట్లు" ఎంతో ప్రజాదరణ పొందింది. మావూరిముచ్చట్లు, ఎచ్చమ్మ కతలు వీరి కథాసంపుటాలు.

### ప్రక్రియ – కథానిక

జీవితపు ముఖ్య సన్నివేశాల్ని క్లుప్తంగా తెలియజేస్తుంది. సంఘటనల మధ్య సంబంధాల్ని కళాత్మకంగా చిత్రిస్తుంది. ఈ వచన ప్రక్రియనే "కథానిక" అంటారు. కథనం, సంభాషణలు, శిల్పం కథానికలోని ప్రధానాంశాలు. క్లుప్తంగా ఉండటం కథానిక ప్రత్యేకత.

© SCERT not to be republished

## సారాంశం

తూర్పున ఇంద్రధనుస్సు విరిసింది. మసకచీకట్లు ముసురుతూండగా రకరకాల వెలుగులు మెరుపు కాగితాల్లా చిత్రవిచిత్రంగా ఆకాశంలో నిండాయి. ఆడపిల్లలు పరికిణీలు, ఓణీలూ వేసుకొని, వాకిళ్ళలో ఒప్పులకుప్ప ఆటలాడుకుంటున్నారు. లేగదూడలు చెంగు చెంగున దూకుతున్నాయి. మనిషికైనా పశువుకైనా బాల్యమే ముద్దు మురిపెం.

చుక్క పొడుపుతో సీత లేచి, గడపలు పూజించింది. చక్కగా తయారై మంగళహారతులు సిద్ధంచేసింది. పాలేరు రంగయ్య నాగలి తీసుకొచ్చాడు. మల్లన్న, రామన్న (ఎద్దులు)లను చక్కగా అలంకరించారు. పెద్దపాలేరు కొబ్బరికాయ కొట్టాడు. ఈసారి ఏరువాకకు ఊరి పెద్దరైతు పాలేరుకు బదులు, రైతు పెద్దకొడుకు రఘురాములు

నాగలి నడిపించాడు, అందరికీ ముందుగా. రఘురాములు మంచి అందగాడు. సీత చాలా అందమైంది. సీత నాగయ్యకు ఒక్కగానొక్క కూతురు.

రఘురాములు తండ్రి కోటయ్య అతికష్టం మీద సీతసంబంధం ఒప్పుకున్నాడు. నాగయ్య కంటే అతడు బాగా ధనవంతుడు కావడంతో, తనేదో నాగయ్య మీద దయదలచి ఆ సంబంధానికి తలఊపినట్లు కోటయ్య ప్రవర్తన ఉండటం నాగయ్యకు ములుకులా అనిపించింది. 'ఎంతైనా మగపిల్లవాళ్లు' కదా! పైగా కలవాళ్ళు. తన దగ్గరున్నదంతా పెట్టినా వాళ్ళవైపు వాళ్ళకు ఒక్కపూట భోజనానికి చాలదు. అప్పుచేయాల్సిందే, అప్పుచేస్తే వడ్డీ కట్టవలసిందే' అనుకున్నాడు. రంగరాయుణ్ణి అడిగితే 'నావద్ద వడ్డీ ఎక్కువ, అదైనా ఇప్పుడు దొరకదు. మూణ్ణెల్ల తర్వాత మాటే' అన్నాడు. చివరికి భూమి తాకట్టు పెట్టి, అప్పు సంపాదించాడు నాగయ్య. తన బిడ్డ భవిష్యత్తుకోసం, సుఖం కోసం అదేమంత కష్టమనిపించలేదు అతనికి.

బంధుమిత్రులంతా వచ్చేశారు. కావలసిన సంభారాలు, సరంజామా అంతా ఏర్పాటు చేసుకున్నారు. పందిళ్ళు, కల్యాణ మండపం, మెరుపుకాగితాలతో అలంకారాలు, పానీయాలు, దిండ్లు గలీబులు, ఐస్‌గడ్డలు.... అన్నీ సమకూర్చుకున్నారు.

నిశ్చితార్థం, వరపూజ తర్వాత కల్యాణం. సీతమ్మ అలంకరణతో బంగారుబొమ్మలా తయారైంది. 'ఆమె పెళ్ళి కోసం భూములు కుదువపెట్టడం ఒక లెక్కలోనిదేగాదు' అనిపించింది తండ్రి నాగయ్యకు. మరుసటిరోజు వరనిశ్చయం కోసం కోటయ్యగారి ఇంటికెళ్ళారు. నిమ్మపండు రంగులో వెలిగిపోతున్న అల్లునికి నూతన వస్త్రాలిచ్చి, బంగారు ఉంగరం తొడిగాడు నాగయ్య. అల్లుడతనికి పాదాభివందనం చేస్తే శరీరం గగుర్పొడిచింది. చమటలు పోశాయి. తర్వాత వియ్యంకుడు పక్కగదిలోకి తీసుకెళ్ళి కట్నం మాటేమిటి?' అని అడిగాడు.

నాగయ్య ఆశ్చర్యపోయాడు. 'ఈ మాట ముందు చెప్పలేదు గదా!' అన్నాడు. 'ఇటువంటి విషయాలు చెప్పేవి గాదు, మా వాడికి లక్షకు తక్కువైతే కుదరదు. నీకు సమయం గావాలంటే, నీ పదెకరాల మాగాణీ నా పేర రాసివ్వు' అనేశాడు. అప్పటికే తాకట్టు పెట్టిన భూమి, తన నిస్సహాయత నాగయ్యను నిరుత్తరుణ్ణి చేశాయి. సీతమ్మ పెండ్లి పెటాకులైపోయింది. రఘురాములు ఇంగ్లాండుకెళ్ళిపోయాడు.

ఏడాది గడిచింది. అందరూ జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. సీత సంగతి చెప్పనవసరమే.లేదు.

హఠాత్తుగా ఒకరోజు రఘురాములు నాగయ్య ఇంటికొచ్చేశాడు. సీత చెయ్యి అందుకున్నాడు. నాగయ్య కాళ్ళమీద పడ్డారు. ఇద్దరినీ దీవించాడు నాగయ్య. ఇది చూసిన సీత తల్లి మా లక్ష్మి కళ్ళలో ఆనందబాష్పాలు కారాయి. ఆరోజు వాళ్ళింట్లో కోటి దీపాలువెల్గినట్లుగా పండుగ వాతావరణం నెలకొంది.



©SCERT not to be republished

## ఇవి చేయండి

### I. అవగాహన – ప్రతిస్పందన

**అ)** మీ పాఠశాలలో ఉపన్యాసపోటీ నిర్వహిస్తున్నారు. అంశం – 'వరకట్న దురాచారం– పరిష్కార మార్గాలు. మీరు ఈ ఉపన్యాసం ఎంతో ఆసక్తిగా ఇవ్వాలనుకున్నారు. 'వరకట్న నిషేధ చట్టం' చాలా కాలం నుండే అమలులో ఉంది. అయినా ఈ దురాచారం పోలేదు. దీనికి మీరు సూచించే పరిష్కారం గురించి మాట్లాడండి.

**ఆ) ఈ కింది ప్రశ్నలకు జవాబులివ్వండి.**

1. నాగయ్య ఖాన్‌సాబ్ వద్దకు ఎందుకు వెళ్ళాడు?
2. రంగయ్య ఎడ్లను ఎలా అలంకరించాడు?

**ఇ) పాఠం ఆధారంగా కింద పేర్కొన్న వ్యక్తులను పరిచయం చేయండి.**

1. రఘురాం 2. మాలక్ష్మి 3. సీతక్క 4. నాగయ్య 5. కోటయ్య

**ఈ) పాఠం చదవండి. కిందివాక్యాలు ఎవరు ఎవరితో అన్నారో రాయండి.**

1. "ఏమన్నావు? వెయ్యా? నా కొడుక్కా?"
2. "తమరు తొల్త ఈ మాట పేరుకైనా ఎత్తలేదు మరి?"
3. "ఈ పిడ్గను జూస్తే నా బిడ్డ గూలి బూమ్మట్టం గాదా?"

**ఉ) కింది పేరా చదవండి. పేరాకు తగిన శీర్షికను సూచించండి.**

చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, కవిత్వం, నాట్యం అనేవి లలిత కళలు. కొందరు 'వాస్తు'ను కూడా 'లలిత కళ' అంటారు. లలిత కళలు సౌందర్య ప్రధానాలు. ఈ లలిత కళల నుండి కలిగే ఆనందాన్ని అనిర్వచనీయం అలౌకికం అంటారు. అనిర్వచనీయం అంటే మనం వర్ణించి చెప్పలేనిది. మంచి ఆహారం తిన్నప్పుడు, ఇష్టమైనవారిని చూసినప్పుడు కలిగే ఆనందం లౌకికం. లలితకళల వలన కలిగే ఆనందం ఇటువంటిది కాదు. ఎటువంటి ప్రయోజనం లేకుండానే కలిగే ఆనందం. అందువల్ల దీన్ని అలౌకికం అన్నారు. అనుభవైకవేద్యం అని కూడా అంటారు. అంటే మనం అనుభవించి తెలుసుకోవలసిందే తప్ప ఒకరు చెప్తే తెలిసేది కాదు అని.

**ఊ) పాఠం చదవండి. కింది పేరాలలో ఏఏ అంశాలున్నాయో పట్టిక రాయండి. ఆ పేరాకు శీర్షిక రాయండి.**

| పేరా సంఖ్య | ముఖ్యమైన అంశాలు | పేరాకు శీర్షిక |
|---|---|---|
| 1వ పేరా | | |
| 6వ పేరా | | |
| 7వ పేరా | | |
| 8వ పేరా | | |



© SCERT not to be republished

ఎ) పాఠం చదివి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. ఏరువాక కోసం పల్లెలో ఎలా సిద్ధమైనారు ?
2. వర్షాకాలంలో సంధ్యాసమయాన్ని రచయిత ఏమని వర్ణించింది?
3. సీతక్క పెండ్లికోసం ఏమేం ఏర్పాట్లు చేశారు?
4. నిశ్చితార్థం నాడు సీతను ఎలా తయారు చేశారు?
5. పాఠంలోని సామెతలను రాయండి.

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. 'మనిషికైనా పసురానికైనా పసితనమే ముద్దు మురిపెం' - దీని నుండి నీవేమి గ్రహించావు?
2. సీత తండ్రి 'ఆనాడు రాత్రి మాఇంట్ల కోటి ప్రెమిదలు వెల్గినవి' అని అన్నాడు గదా! అతడు ఎందుకని అలా అన్నాడు? ఊహించి రాయండి.
3. సీతక్క పెండ్లికి ఏఏ ఏర్పాట్లు చేశారో తెలుసుకొన్నారు కదా! ఇప్పుడు పెండ్లిళ్ల ఏర్పాట్లు అప్పటిలాగా ఉన్నాయా? పోలికలు, భేదాలు రాయండి.
4. ఈ పాఠంలో మనసంస్కృతి, సంప్రదాయాలకు చెందిన అంశాలను వేటిని రచయిత్రి వివరించింది ?
5. సీతను నిండుకుండతో పోల్చారుకదా! ఏఏ గుణాలు ఉంటే నిండుకుండతో పోలుస్తారు?

ఇ) కింది ప్రశ్నలకు పదిహేను వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. 'సీతక్క పెండ్లి' పాఠంలోని ముఖ్యసన్నివేశాలను సొంతమాటల్లో వర్ణిస్తూ రాయండి.
2. 'వరకట్నం ఇవ్వడం- తీసుకోవడం నేరమని' మన చట్టాలు చెబుతున్నాయి కదా! దీన్ని సమర్థిస్తూ రాయండి.

ఈ) సృజనాత్మకంగా రాయండి.

సీతక్కపెండ్లి పాఠాన్ని సంభాషణరూపంలోకి మార్చి రాయండి.

(లేదా)

తూర్పున సింగిణేసింది ............. పేరా చదవండి. దీనికి అనుగుణంగా చిత్రం గీయండి. రంగులు వేయండి. దాన్ని గురించి రాయండి.

© SCERT not to be republished

**ఉ) ప్రశంసాత్మకంగా రాయండి.**

పాఠంలో ఏదైనా పేరాను వ్యవహారభాషలోకి మార్చి రాయండి.

లేదా

నేడు వివాహాలను ఉన్నవారు ఘనంగా చేస్తుంటే లేనివారు పెండ్లిళ్లే చేయలేక ఇబ్బంది పడుతున్నారు. అట్లే వివాహాలో వరకట్నాలు, తిండికి పెట్టే ఖర్చులు, ఆర్భాటాల కింద ఊరేగింపులు, విందులు ఏర్పాటుచేయడం వంటివి చోటు చేసుకొంటున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని వివాహాల్లో చోటు చేసుకోవాలిసిన సంస్కరణల గురించి కరపత్రం లేదా పోస్టరు తయారు చేయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు సమానార్థకాలు రాయండి.**

ఉదా॥ సంపద ఉన్నా గర్వపడగూడదు. (కలిమి)

1. రామయ్యనే వారి కుటుంబానికి ఆసరా. ( )
2. సింధూరకు తరగతిలో ప్రథమస్థానం పొందాలనే తాపత్రయం ఉంది. ( )
3. నింగి వొదిగివొచ్చి న్యాలను ముద్దిచ్చుకున్నట్లు... ( )
4. తన కూతురు పెళ్ళికోసం తన ఇల్లునే కుదవబెట్టాడు. ( )
5. 'కట్నం ఇవ్వాల్సిందేనని కరాఖండిగా చెప్పాడు' రంగయ్య. ( )

**ఆ) కింది జాతీయాలను సొంత వాక్యాలలో ఉపయోగించండి. వాటిని ఏ అర్థంలో వాడారో రాయండి.**

ఉదా॥ ఆ తల్లి తన కుమారుని రాకకోసం కళ్ళల్లో వత్తులేసుకొని చూసింది. (అదేపనిగా ఎదురుచూడటం)

1. మిరుమిట్లు గొలుపు 2. జిగజిగలు కురిసినట్లు 3. పొల్లుపోకుండా
4. మసిపూసి మారేడుకాయ జేయి. 5. గుడ్లప్పగించి చూడు 6. కండ్లు కాయలు కాచు
7. కాలికి బుద్ధిచెప్పు 8. గొడ్డలిపెట్టు

### వ్యాకరణాలు

**ఇ) కింది ఉదాహరణను పరిశీలించండి. కింది పదాలకు విగ్రహవాక్యాన్ని రాసి, విభక్తి ప్రత్యయాన్ని బ్రాకెట్లలో రాయండి.**

ఉదా॥ విహారయాత్ర విహారము కొరకు యాత్ర (చతుర్థీ)

1. రాజాజ్ఞ ( )
2. మాటనేర్పరి ( )
3. చెరువునీరు ( )
4. కృష్ణాశ్రితుడు ( )

© SCERT not to be republished

5. ప్రాణసంకటం ( )

6. ధనాఢ్యుడు ( )

7. ప్రాణాధికం ( )

8. జలధరం ( )

9. భార్యాసమేతుడు ( )

10. పూజాగృహం ( )

**ఈ) కింది పదాలను విడదీసి, సంధిపేర్లను రాయండి.**

(i). 1.మంగళార్తి 2.వీరావతారం 3.ప్రళయాగ్ని 4.కవీంద్రుడు 5.భానూదయం

(ii). 1.నాకున్న 2.నన్నడిగి 3.అతడట్లు 4.దిక్కేది 5. భీముడతడు

(iii). 1. నిట్టూర్పు 2. కుట్టుసురు 3. నట్టిల్లు 4. చిట్టెలుక 5. కట్టెదురు

(iv). 1. కానరాకుండ వోయినట్లు 2. కూరగాయలు 3. తల్లిదండ్రులు 4. కాలుసేతులు

**ఉ) కింది సామాన్యవాక్యాలను సంశ్లిష్టవాక్యాలుగా మార్చండి.**

1. చుక్కపొడుపుతో సీత లేచింది. సీత గడపను పూజించింది.
2. బంధుమిత్రులంతా వచ్చేశారు. కావలసిన సంభారాలు ఏర్పాటుచేసుకున్నారు.

**ఊ) కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చండి.**

1. సీతక్క నిశ్చితార్థం జరిగింది. నాగయ్య సంబరపడ్డాడు.
2. సీతక్క పెళ్ళికి ఏర్పాట్లుచేశారు. సీతమ్మ పెండ్లి పెటాకులయింది.

© SCERT not to be republished

**ప్రాజెక్టు పని**

మీ ప్రాంతంలో జరిగే వివిధ మతాల వివాహ కార్యక్రమాలను గురించిన సమాచారాన్ని సేకరించండి. తరగతిలో చర్చించి నివేదిక తయారు చేయండి.

ధనంకన్నా లోకకల్యాణం ఎంతో శ్రేష్ఠమైంది.

– మహావీరుడు